సాక్షి కరీంనగర్

శనివారం । 4 । మే । 2024



ఉమ్మడి జిల్లాలో భానుడు భగ్గుమంటున్నాడు. ఉదయం పది గంటలు దాటకముందే ఠారెత్తిస్తున్నాడు. పట్టపగలు చుక్కలు చూపిస్తున్నాడు. ఉమ్మడి జిల్లాలో 46 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదుకాగా.. 50 డిగ్రీలు నమోదయ్యే అవకాశముందని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. శుక్రవారం ఉమ్మడి జిల్లాలోని పలుచోట్ల గరిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డుస్థాయిలో నమోదు కాగా.. మరో వారం రోజులు ఎండలు దంచికొట్టే అవకాశముందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

సూరీడు భగభగ

ఉమ్మడి జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైన ప్రాంతాలు

కరీంనగర్ (రామడుగు)	సిరిసిల్ల (ఇల్లంతకుంట)	పెద్దపల్లి (మంథని)	జగిత్యాల (నేరెళ్ల)
46.0	45.5	46.7	46.7

న్యూస్‌రీల్

ఫిట్‌మెంట్, అలవెన్స్‌పై తేల్చండి



కరీంనగర్ అర్బన్: నాలుగో తరగతి ఉద్యోగుల ఫిట్‌మెంట్, అలవెన్స్‌లపై సముచిత ప్రాధాన్యతనివ్వాలని తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోట రామస్వామి కోరారు. శుక్రవారం పీఆర్సీ కమిషన్ కమిటీ సభ్యులను కలిసి సమస్యలను వివరించారు. ఉద్యోగులకు ఓపీఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆదాయపు పన్ను రూ.10 లక్షలకు పెంచాలని, పెన్షన్‌కు ప్రతికూలమైన పీఎఫ్ఆర్‌డీఏ చట్టాన్ని తొలగించాలని కోరారు. జిల్లా కార్యదర్శి డి.నర్సింహారెడ్డి, నగర అధ్యక్షుడు శ్రీనివాస్, శంకరయ్య ఉన్నారు.

రామయ్య హుండీ లెక్కింపు



ఇల్లందకుంట: ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం హుండీ ఆదాయాన్ని శుక్రవారం లెక్కించారు. శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల సందర్భంగా రూ.17,75,572 ఆదాయంగా వచ్చినట్లు కరీంనగర్ డివిజన్ దేవాదాయ పరిశీలకుడు పి.సత్యనారాయణ, ఈవో కందుల సుధాకర్ తెలిపారు. బంగారం 13గ్రాముల, 450 గ్రాముల వెండి కానుకల రూపంలో వచ్చినట్లు వెల్లడించారు.

జవాన్ల పాత్ర అనిర్వచనీయం



కరీంనగర్ అర్బన్: దేశరక్షణ కోసం ప్రాణాలను పణంగా పెట్టే జవాన్ల పాత్ర అనిర్వచనీయమని టీఎస్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పదవీ విరమణ పొందిన సైనికులు మారెళ్ల శ్రీధర్, సంఘ కిషోర్, సుధాకర్ మల్లేశం, సాగర్‌ను శుక్రవారం సంఘ భవనంలో ఘనంగా సన్మానించారు. టీఎస్జీవోల జిల్లా కార్యదర్శి సంఘం లక్ష్మణరావు, జిల్లా కోశాధికారి కిరణ్ కుమార్ రెడ్డి, రూరల్ అధ్యక్షుడు మారుపాక రాజేశ్ భరద్వాజ్, మహిళా జేఏసీ చైర్మన్ ఇరుమళ్ల శారద, శైలజ, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

యువత కోసం ఉద్యమించాలి

కరీంనగర్: యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించలేని ప్రభుత్వాలపై అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) ఉద్యమాలు నిర్వహించాలని సీపీఐ నేత చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ 65వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం జిల్లాకేంద్రంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్ ఎదుట ఏఐవైఎఫ్ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1958 మే 3న ఏఐవైఎఫ్ ఆవిర్భవించిందని, ఆరు దశాబ్దాలకు పైగా సమరశీల పోరాటాలు చేస్తోందని అన్నారు. దేశంలో 40శాతానికి నిరుద్యోగ యువత ఉన్నారని వారందరికీ ఉపాధి అవకాశాలు కల్పించడంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, సీపీఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, కొయ్యడ సృజన్‌కుమార్ పాల్గొన్నారు.

'నీట్'కు ఏర్పాట్లు పూర్తి

కరీంనగర్: ఈనెల 5వ తేదీన నిర్వహించే నీట్ పరీక్షకు ఏర్పాట్లు చేశామని కో–ఆర్డినేటర్ టి.లలితకుమారి తెలిపారు. జిల్లాలోని ఐదు పరీక్ష కేంద్రాల్లో 3,540మంది హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. జగిత్యాల రోడ్‌లోని వివేకానంద రెసిడెన్షియల్ పాఠశాల(సీబీఎస్ఈ)లో 828 మంది, వివేకానంద డిగ్రీ పీజీ కళాశాలలో 792మంది, ప్రభుత్వ మహిళా కళాశాలలో 480మంది, తిమ్మాపూర్ శ్రీచైతన్య కళాశాలలో 720మంది, వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాలలో 720మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నట్లు తెలిపారు. పరీక్ష మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5.20వరకు ఉంటుందని, విద్యార్థులు అడ్మిట్‌కార్డులపై నిర్దేశించబడిన సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, ఉదయం 11గంటల తరువాత కేంద్రాల్లోకి అనుమతిస్తారని, తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని సూచించారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించమని అన్నారు.

జిల్లా పౌరసరఫరాల అధికారిగా సురేశ్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్: జిల్లా పౌరసరఫరాల అధికారిగా కె.సురేశ్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డీఎస్వో గౌరీశంకర్ ఇటీవల ఉద్యోగ విరమణ చేయగా అతని స్థానంలో ఏఎస్వో సురేశ్‌రెడ్డిని నియమించింది. సురేశ్‌రెడ్డి రెండు నెలల క్రితం వరకు ఇక్కడే ఇన్‌చార్జి డీఎస్వోగా వ్యవహరించిన విషయం తెలిసిందే.

ఏమీ చేయనోళ్లకు ఓటెందుకేయాలె?



సిరిసిల్ల సభకు హాజరైన జనం, కార్యకర్తలు



సభలో ఎంపీ అభ్యర్థిని గెలిపించాలంటున్న సీఎం రేవంత్‌రెడ్డి

- బీజేపీ, బీఆర్ఎస్ పీడ, సిరిసిల్ల చీడ వదిలిస్తా
- పెద్దపల్లి పార్లమెంట్‌ను మరింత అభివృద్ధి చేస్తా
- రాజారాంపల్లి, సిరిసిల్లలో సీఎం రేవంత్ రెడ్డి

సిరిసిల్ల/గొల్లపల్లి: వచ్చే ఎన్నికల్లో సిరిసిల్లకు పట్టిన చీడను వదిలిస్తాం. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని పత్తిపాక రిజర్వాయర్, పాలకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్, రామగుండం 800 మెగావాట్లతో పవర్‌స్టేషన్, మంచిర్యాల జిల్లాలో మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ నిర్మిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం రాజారాంపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని మొదటి బైపాస్‌రోడ్డులో జరిగిన కాంగ్రెస్ జనజాతర సభల్లో మాట్లాడారు. నేత కార్మి కులకు ఉద్దేరోడు పెట్టిన రూ.275 కోట్లు ఎన్నికల కోడ్ ముగియగానే వెంటనే చెల్లిస్తామని, ఇప్పటికే రూ. 50 కోట్లు మంజూరు చేశామన్నారు. కరీంనగర్ పార్లమెంట్ బరిలో అపర మేధావి ఒకరు..అరగుండు మేధావి మరొకరని ఇద్దరూ పాతవాళ్లే ఉన్నారని ఎద్దేవా చేశారు. ఏమీచేయనోళ్లకు ఓటెందుకు వేయాలని ప్రశ్నించారు. కరీంనగర్ ఎంపీగా రాజేందర్‌రావును ఆశీర్వదిస్తే..నూలుపై విధించిన ఐదుశాతం జీఎస్టీని రద్దు చేయిస్తామన్నారు. కాకా వారసుల్లో ఒకరైన పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీని గెలిపించాలని కోరారు.

పెద్దపల్లి పార్లమెంట్‌కు వరాల జల్లు..

రాజారాంపల్లిలో సీఎం ప్రసంగం పార్టీ శ్రేణులను ఉత్తేజపరిచింది. ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అడిగిన వాటిలో అన్నింటికీ సీఎం హామీ ఇచ్చారు. పత్తిపాక రిజర్వాయర్, జంగల్‌నాల ఆధునీకరణ, గోదావరి వెంట లిఫ్టుల ఆధునీకరణ, ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలు, బస్‌డిపో, డిగ్రీ కళాశాల, రెవెన్యూ డివిజన్ ఇంకా ఏమైనా ఉన్నా మంజూరు చేస్తానని హామీ ఇస్తూ పార్టీ శ్రేణుల్లో జోష్ నింపారు. కొప్పుల ఈశ్వర్ ఈ ప్రాంతానికి ఎమ్మెల్యే, మంత్రిగా ఒరగబెట్టిందేమీ లేదని, ఎంపీ అభ్యర్థిగా నిలబడే హక్కు లేదన్నారు. ప్రధాని మోదీ ఎకానమీ అని మాట్లాడుతున్నారని, అసలు ఎకానమీకి పునాదులు వేసిందే పీవీ నర్సింహారావు అన్నారు. సింగరేణి కీర్తిగడించిదంటే.. కాకా వెంకటస్వామి చలవేనన్నారు.

బీఆర్ఎస్‌తో 'బండి' లోపాయికారి ఒప్పందం: మంత్రి పొన్నం

కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ గ్రానైట్ పరిశ్రమపై ఫిర్యాదు చేసి బీఆర్ఎస్ నాయకులతో లోపాయికారి ఒప్పందం చేసుకున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ఆరోపించారు. ఎన్నికల కోడ్ ముగియగానే రూ. 4వేల పింఛన్లు, కొత్త రేషన్ కార్డులు ఇస్తామని, రూ.2లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వం గత పదేళ్లలో చేసిన ఆర్థిక విధ్వంసాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం గాడిలో పెడుతుందని వివరించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ..సిరిసిల్ల ఎమ్మెల్యే యువరాజు కాళేశ్వరం ప్రాజెక్టు 9వ ప్యాకేజీ పూర్తి చేయకుండా మిగతా ప్రాజెక్టులు పూర్తిచేసి వారి భూముల్లో నీళ్లు పారించారని ఆరోపించారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ..రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విప్ అడ్లూరి మాట్లాడుతూ, ఇక్కడి నీటిని సిద్దిపేట, కేసీఆర్ ఫామ్‌హౌస్‌లకు తీసుకెళ్తుంటే మంత్రిగా ఉన్న ఈశ్వర్ అడ్డుకోకపోవడంతో ఈ ప్రాంతం ఎడారిగా మారిందన్నారు. పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి వంశీ మాట్లాడుతూ, రాజకీయ వారసత్వం కలిగిన తాత వెంకటస్వామి ఈ ప్రాంతానికి చేసిన అభివృద్ధికి పూర్వ వైభవం తీసుకువస్తానని, తనను గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యేలు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, మక్కాన్‌సింగ్‌ఠాకూర్, విజయరమణారావు, ప్రేమ్ సాగర్‌రావు, వివేక్, వినోద్, సిరిసిల్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, ఏఐసీసీ ఇన్‌చార్జి రోహిత్ చౌదరి, సీపీఐ నాయకుడు చాడ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆలస్యంగా సభలకు సీఎం

వెల్గటూర్ మండలం రాజారాంపల్లిలో మధ్యాహ్నం 2 గంటలకు జరగాల్సిన సభ అనివార్య కారణాల వల్ల ఆలస్యమైంది. సీఎం సాయంత్రం 6.30 గంటల సమయంలో సభాస్థలికి చేరుకున్నారు. అప్పటి వరకు ప్రజలు వేచి చూస్తున్నారు. సిరిసిల్లలో మధ్యాహ్నం 3గంటలకు సభ ఉంటుందని జన సమీకరణ చేశారు. రాత్రి 8.45 గంటలకు సీఎం సభాస్థలికి చేరుకోగా అప్పటికే చాలా మంది సభనుంచి వెళ్లిపోయారు. సీఎం 26 నిమిషాల పాటు ప్రసంగించారు.

సింగరేణిని ముంచింది కాంగ్రెస్సే



గోదావరిఖనిలో బీఆర్ఎస్ రోడ్‌షోకు హాజరైన జనం



మాట్లాడుతున్న కేసీఆర్

- సింగరేణి మన సొత్తు.. మన ఆస్తిని కాపాడుకోవాలె
- దిక్కుమాలిన కాంగ్రెస్‌తోనే కేంద్రం పొత్తు
- బస్సుయాత్రలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్

గోదావరిఖని: 'మంచిగ ఉన్న సింగరేణిని నిండా ముంచిందే కాంగ్రెస్ పార్టీ.. మళ్లీ బీజేపీ, కాంగ్రెస్‌కు ఓటు వేస్తే ఉన్న సింగరేణిని ఊడగొట్టే ప్రమాదం మీముందట ఉంది' అని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక ప్రధాన చౌరస్తాలో జరిగిన బస్సుయాత్రలో 'ఖని' ప్రజలను ఉద్దేశించి కేసీఆర్ మాట్లాడారు. నష్టాల్లో ఉన్న సింగరేణి బొగ్గు గనుల సంస్థను లాభాల్లోకి తీసుకొచ్చింది బీఆర్ఎస్ అన్నారు. 19వేల మంది కార్మికుల పిల్లలకు కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు ఇప్పించామని అన్నారు. సిమ్స్ పేరిట సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్స్ సైన్స్ కాలేజీ ప్రారంభించామని, ఇందులో 5శాతం మెడికల్ సీట్లు కార్మికుల పిల్లలకు ఇచ్చేలా ఒప్పందం చేశామని అన్నారు. రాష్ట్ర సింగరేణి బొగ్గును కాదని, అదానీకి చెందిన విదేశీ బొగ్గును దిగుమతి చేసుకుని సింగరేణిని దెబ్బతీసే కుట్ర జరుగుతోందని ఆందళన వ్యక్తం చేశారు. విజ్ఞులైన గోదావరిఖనివాసులు ఆలోచించి పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని కోరారు. తద్వారా సింగరేణి పరిరక్షణకు పోరాటం చేస్తామని అభయం ఇచ్చారు. గతంలో కాంగ్రెస్ హయాంలో సింగరేణి నష్టాల పాలైందని, దీంతో 49శాతం వాటా కేంద్రప్రభుత్వానికి అప్పగించాల్సి వచ్చిందని అన్నారు. అదానీ బొగ్గు అత్యధిక ధరకు ఇక్కడకు తీసుకొచ్చి సింగరేణి బొగ్గును నిలిపివేయాలని గతంలోనే కుట్రపన్నితే.. తాను ముఖ్యమంత్రిగా ఉన్నరోజుల్లో దీన్నిపూర్తిగా అడ్డుకున్నానని పేర్కొన్నారు. 'ఆస్ట్రేలియా నుంచి దిగుమతి చేసుకున్న బొగ్గును అదానీ అధిక ధరకు ఇస్తామన్నారు.. దీన్ని నేను ఒప్పుకోలేదు' అని అన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దావోస్ వెళ్లి అదానీతో ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికలు అవడమే ఆలస్యం.. ఉన్న సింగరేణిని దేశప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కలిసి ఊడగొడతారని ధ్వజమెత్తారు. సింగరేణి తెలంగాణ కు కొంగుబంగారమని పేర్కొన్నారు. దీన్ని ముంచాలని చూస్తున్నారని ఆరోపించారు. విదేశీ బొగ్గు గనులను సింగరేణికి అప్పగించాలని, ఇందుకోసం డైరెక్టర్లను విదేశాలకు పంపించి అధ్యయనం చేయించామని అన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి సింగరేణిని మూసెయ్యాలని చూస్తున్నారని, పార్లమెంట్‌లో బీఆర్ఎస్ ఎంపీలు గెలిస్తే గంతేసి కొట్లాడి సింగరేణిని కాపాడుతారని అన్నారు. కార్యక్రమంలో పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, పుట్ట మధు, బాల్క సుమన్, టీబీజీకేఎస్ నాయకులు రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, కేసీఆర్ పాటకు అనుగుణంగా జెడ్పీ చైర్మన్ పుట్ట మధు స్టెప్పులేశారు. కేసీఆర్ ప్రసంగించి బస్సులోనికి వెళ్లగా వెనకాల ఉన్న పుట్ట మధు పాటకు అనుగుణంగా స్టెప్పులేసి ఆకట్టుకున్నారు. అంతకుముందు కేసీఆర్ సీపీ కార్యాలయంలోని హెలిప్యాడ్ చేరుకున్నారు. పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు చందర్, పుట్ట మధు, బాల్క సుమన్, మనోహర్‌రెడ్డిలు స్వాగతం పలికారు.



స్వాగతం పలుకుతున్న నాయకులు

పర్యటన హైలైట్స్..

- సాయంత్రం 5.35గంటలకు హెలికాప్టర్ ద్వారా రామగుండం కమిషనరేట్ హెలిపాడ్‌కు చేరుకున్న కేసీఆర్
- 5.36గంటలకు హెలిపాడ్ వద్ద నాయకులు ఘనస్వాగతం పలికారు
- సాయంత్రం 5.45గంటలకు సింగరేణి ఇల్లెందు గెస్ట్‌హౌస్ చేరుకున్నారు.
- రాత్రి 8.30గంటలకు ఇల్లెందు గెస్ట్‌హౌస్ నుంచి ప్రధాన చౌరస్తాకు బస్సులో బయలుదేరిన కేసీఆర్
- రాత్రి 8.35గంటలకు రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ టీ జంక్షన్ వద్ద బీఆర్ఎస్ శ్రేణులు, టీబీజీకేఎస్ నాయకులు ఘన స్వాగతం పలికారు.
- రాత్రి 9.00గంటలకు ప్రధాన చౌరస్తాకు చేరుకుని బస్సుపైకి ఎక్కి ప్రజలకు అభివాదం చేసిన కేసీఆర్.. ఆ తర్వాత ప్రసంగం ప్రారంభించారు
- రాత్రి 9.30గంటలకు ప్రసంగం పూర్తి చేశారు. తిరిగి బస్సులో సింగరేణి ఇల్లెందు గెస్ట్‌హౌస్‌కు చేరుకున్నారు.
- రాత్రి గోదావరిఖనిలోనే బస చేస్తారు.
- శనివారం సాయంత్రం మంచిర్యాలలో బస్సుయాత్ర చేపడతారు.

కారులో కల్లోలం

- కాంగ్రెస్‌లోకి 9 మంది కార్పొరేటర్లు
- సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో చేరిక
- బల్దియాలో మారుతున్న సమీకరణలు
- 45 మ్యాజిక్ ఫిగర్‌పైనే నజర్

సాక్షిప్రతినిధి,కరీంనగర్/కరీంనగర్ కార్పొరేషన్: ఎన్నికల కీలక సమయంలో కారులో కల్లోలం చెలరేగుతోంది. ఎంపీ ఎన్నికకు పట్టుమని పది రోజులు కూడా లేని సమయంలో కరీంనగర్ బీఆర్ఎస్‌కు పెద్ద షాక్ తగిలింది. నగరపాలకకు చెందిన తొమ్మిది మంది బీఆర్ఎస్ కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరారు. శుక్రవారం సిరిసిల్లలో ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో, మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. నగరపాలకసంస్థలో రాజకీయ సమీకరణలో భారీగా మారుతుండగా, 45 మ్యాజిక్ ఫిగర్‌పై ప్రస్తుతం అందరి దృష్టి పడింది.

కాంగ్రెస్‌లో చేరిక

నగరంలోని తొమ్మిది మంది కార్పొరేటర్లు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్ఎస్‌కు చెందిన 30వ డివిజన్ కార్పొరేటర్ నేతికుంట యాదయ్య, 35వ డివిజన్ కార్పొరేటర్ చాడగొండ బుచ్చిరెడ్డి, 43వ డివిజన్ కార్పొరేటర్ సరిళ్ల ప్రసాద్, 40వ డివిజన్ కార్పొరేటర్ కోటగిరి భూమాగౌడ్, 11వ డివిజన్ కార్పొరేటర్ ఆకుల నర్మద నర్సయ్య, 44వ డివిజన్ కార్పొరేటర్ మెండి శ్రీలత చంద్రశేఖర్, 22 డివిజన్ కార్పొరేటర్ గంట కల్యాణి శ్రీనివాస్, 45వ డివిజన్ కార్పొరేటర్ పిట్టల వినోద శ్రీనివాస్, 17వ డివిజన్ కార్పొరేటర్ కోల భాగ్యలక్ష్మి ప్రశాంత్‌లు సీఎం సమక్షంలో కాంగ్రెస్ గూటికి చేరారు. ఇప్పటికే చేరిన 2వ డివిజన్ కార్పొరేటర్ కాశెట్టి లావణ్య శ్రీనివాస్, 7వ డివిజన్‌కు చెందిన ఆకుల పద్మ ప్రకాశ్‌లకు కూడా రేవంత్‌రెడ్డి కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. వీరితో పాటు అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ కర్ర రాజశేఖర్, మాజీ డైరెక్టర్లు అనురాస్‌కుమార్, వీరారెడ్డి, మాజీ కార్పొరేటర్ పత్తెం పద్మ మోహన్ తదితరులు కాంగ్రెస్‌లో చేరినవారిలో ఉన్నారు. ఇదిలాఉంటే కార్పొరేటర్ల చేరికతో తమ రాజకీయ భవిష్యత్ ఏంటని ఇప్పటికే కాంగ్రెస్‌లో ఉన్న డివిజన్ నాయకులు వాపోతున్నారు. వచ్చే కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేయాలని ఆశిస్తున్న వీరంతా, కార్పొరేటర్ల రాకపై అసహనంతో ఉన్నారు.

45 సంఖ్యపైనే నజర్

నగరపాలకసంస్థలో రాజకీయ సమీకరణలు శరవేగంగా మారుతున్నాయి. ప్రస్తుత పాలకవర్గ పదవీకాలం మరో ఆరు నెలలు ఉండగా, మ్యాజిక్‌ఫిగర్ 45పైనే ప్రస్తుతం అందరి దృష్టిపడింది. నగరంలో 60 డివిజన్‌లు ఉండగా, మూడొంతుల మెజార్టీకి 45 సీట్లు అవసరం. నగరపాలకసంస్థకు 2020లో జరిగిన ఎన్నికల్లో టీఆర్ఎస్ (బీఆర్ఎస్) అధికారం చేపట్టింది. 33 స్థానాల్లో టీఆర్ఎస్, 13 స్థానాల్లో బీజేపీ, ఎంఐఎం ఆరు, స్వతంత్రులు ఐదుగురు, టీఆర్ఎస్ రెబెల్స్ ముగ్గురు గెలుపొందారు. అనంతరం మారిన పరిణామాలతో బీజేపీ నుంచి ఐదుగురు, స్వతంత్రులు నలుగురు, రెబెల్స్ ముగ్గురు బీఆర్ఎస్‌లో చేరారు. ఒక స్వతంత్రుడు ఎంఐఎంలో, బీఆర్ఎస్ కార్పొరేటర్ ఒకరు బీజేపీలో చేరారు. దీంతో బీఆర్ఎస్‌కు 44, బీజేపీకి 9, ఎంఐఎంకు 7గురు కార్పొరేటర్లయ్యారు. కాగా మారిన తాజా పరిస్థితుల్లో 11మంది పార్టీ మారడంతో, బీఆర్ఎస్‌కు 33, కాంగ్రెస్‌కు 11, బీజేపీకి 9, ఎంఐఎంకు 7 స్థానాలున్నాయి. ఇదిలాఉంటే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి రెండోవిడత చేరికలు కూడా ఉంటాయని ప్రచారం ఉంది. దీంతో పార్టీ బలాబలాలు ఇంకా మారే అవకాశం కనిపిస్తోంది.



కాంగ్రెస్‌లో చేరిన కార్పొరేటర్లు

మహాశక్తి ఆలయంలో ప్రమాణం చెయ్

- మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ కార్పొరేషన్: 'నువ్వు చేసిన ఆరోపణలు నిజమైతే నువ్వు నమ్మే మహాశక్తి ఆలయానికి తడిబట్టలతో వచ్చి ప్రమాణం చెయ్'' అంటూ బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బీజేపీ ఎంపీ బండి సంజయ్‌కి సవాల్ విసిరారు. కాంగ్రెస్ పుంజుకోవడంతో అసహనానికి గురై ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నాడని, నోటికి ఏదొస్తే అది మాట్లాడితే సమాజం చూస్తూ ఊరుకోదని మండిపడ్డారు. కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతుగా నగరంలోని రేకుర్తి, రాజీవ్‌చౌక్‌లో నిర్వహించిన రోడ్‌షోల్లో పొన్నం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఎన్నికల్లో భార్య పుస్తెల తాడు అమ్ముకొని పోటీచేశానన్న సంజయ్, ఈ ఎన్నికల్లో వందల కోట్ల రూపాయలు అవలీలగా ఎలా ఖర్చు చేస్తున్నాడని ప్రశ్నించారు. హిందీ, ఇంగ్లిష్ భాషలు రాని సంజయ్ పార్లమెంట్‌లో ఈ ప్రాంత సమస్యలు ఎలా లేవనెత్తుతాడన్నారు. బండి లాగా తాను శానిటేషన్ కాంట్రాక్టర్ దగ్గర డబ్బులు తీసుకోలేదన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్ ప్యాక్ అయ్యాడని, ఆయనకు ఓటు వేస్తే మోరీలో వేసినట్లేనన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మరో ఐదేళ్లు అధికారంలో ఉంటుందని, ఇచ్చిన హామీలు అమలు చేస్తుందన్నారు. రూ.500 గ్యాస్ సిలిండర్ రాని వాళ్లు స్థానిక కాంగ్రెస్ నాయకుల దృష్టికి తీసుకురావాలని, తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలన్నారు. ఎన్నికల కోడ్ ముగిశాక కొత్త పింఛన్లు, పెరిగిన రూ.4 వేల పింఛన్లు, కొత్త రేషన్‌కార్డులు ఇప్పిస్తామన్నారు. మహాలక్ష్మి పథకం కింద రూ.2500 కూడా ఇస్తామన్నారు. దున్నపోతుకు గడ్డి వేసి బర్రె పాలుపిండొద్దని, అభివృద్ధి చేసే కాంగ్రెస్‌కే ఓటు వేయాలన్నారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యేలు ఆరెపల్లి మోహన్, కోడూరి సత్యనారాయణగౌడ్, కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, వైద్యుల అంజన్‌కుమార్ పాల్గొన్నారు.



రాజీవ్‌చౌక్‌లో మాట్లాడుతున్న మంత్రి పొన్నం

బీజేపీ గెలిస్తేనే అందరికీ భరోసా

- ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్

కరీంనగర్ టౌన్/హుజూరాబాద్: కేసీఆర్ పాలనలో గుర్తొచ్చేవి మద్యం, అత్యాచారాలు, హత్యలు మాత్రమేనని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ అన్నారు. ఈ మేరకు నగరంలోని శుక్రవారం ఎంపీ కార్యాలయంలో మహిళా శక్తి, దివ్యాంగులతో సమావేశం అయ్యారు. సాయంత్రం హుజూరాబాద్‌లో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. సంజయ్ మాట్లాడుతూ.. అవినీతి, అరాచకాల్లో బీఆర్ఎస్ నేతలు గుడిని మింగితే కాంగ్రెస్ నేతలు గుడి లింగాన్ని కూడా మింగేరకమన్నారు. చేయి గుర్తు అంటే భస్మాసుర హస్తమేనని, ప్రధానమంత్రి మోదీతో రాహుల్ గాంధీకి పోలికా అంటూ ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్, కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్ ఎప్పుడైనా కనిపించారా? అని ప్రశ్నించారు. వినోద్‌కుమార్ ఎంపీగా ఉన్నప్పుడు కరీంనగర్– వరంగల్ రోడ్డును ఎందుకు విస్తరించలేదని అడిగారు. తానే కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి రూ.2వేల కోట్లకుపైగా నిధులు తీసుకొచ్చి ప్రధానితో పనులు ప్రారంభించినట్లు గుర్తు చేశారు. కాంగ్రెస్ అభ్యర్థిని ఆ పార్టీ కార్యకర్తలే గుర్తుపట్టరని, ఫోన్ ట్యాపింగ్ డబ్బులతో టికెట్ తెచ్చుకుని, ఆ పైసలు పంచి గెలవాలని చూస్తున్నాడన్నారు. రేవంత్ రెడ్డి ఒక్కహామీ అమలు చేయకుండా జనాన్ని మోసం చేశాడని, కాంగ్రెస్ మోసాలకు బుద్ధి చెప్పాలని కోరారు. దివ్యాంగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ కొల్లి నాగేశ్వరరావు, నాయకులు అంజన్‌రెడ్డి, జక్కం సంపత్, అంజయ్య, పర్వతాలు, శ్రీనివాస్ తదితరులు ఎంపీ కార్యాలయంలో బండి సంజయ్‌ని కలిసి కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన సంజయ్ అండగా ఉంటానని, వారి డిమాండ్లు నెరవేర్చేదాకా పోరాడతానని హామీ ఇచ్చారు. మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ జి.మనోహర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మ జయశ్రీ, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ శిల్ప, తమిళనాడు నాయకురాలు నళిని, జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, చొప్పరి జయశ్రీ, సుధ, పద్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బండి సంజయ్‌కుమార్

30 రోజులు కష్టపడండి

- మీ ముంగిట్లోకే విజయం
- కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్: పదో తరగతిలో ఫెయిల్ అయ్యామని నిరాశకు లోనుకావొద్దు. 30రోజులు కష్టపడండి.. చదవండి.. రాయండి.. తప్పకుండా పాసవుతారు అని కలెక్టర్ పమేలా సత్పతి విద్యార్థులకు ధైర్యం చెప్పారు. శుక్రవారం కరీంనగర్ జెడ్పీ క్వార్టర్స్‌లోని పంచాయతీ రాజ్ రిసోర్స్‌సెంటర్‌లో ఇటీవల పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఓరియంటేషన్ నిర్వహించారు. కలెక్టర్ పమేలా సత్పతి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. ఒకటి, రెండు సబ్జెక్టులో ఫెయిల్ అయ్యామని ఫీల్ కావొద్దు. రాత్రి, పగలు 30రోజులు కష్టపడాలి తప్పకుండా విజయం సాధిస్తారని సూచించారు. మీరంతా పాస్ అయితే నేను పాస్ అయినట్లే భావిస్తానని అన్నారు. జిల్లాలో ఫెయిల్ అయిన 421మంది విద్యార్థులు మళ్లీ తప్పకుండా పాస్ అవుతారనే విశ్వాసం తనకు ఉందన్నారు. పిల్లలను పక్కవారితో పోల్చుతూ, చులకనగా చూడొద్దని తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈవో జనార్దన్‌రావు, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ నరసింహస్వామి, సెక్టోరల్ అధికారి అశోక్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి జైపాల్‌రెడ్డి, మధుసూదనాచారి, శ్రీనివాస్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, డీసీఈబీ సెక్రటరీ స్వదేశ్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

ఈసీ మార్గదర్శకాలపై అవగాహన అవసరం

కరీంనగర్ అర్బన్: ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాలపై మైక్రో అబ్జర్వర్లకు అవగాహన ఉండాలని, ఎన్నికల్లో జాగ్రత్తగా వ్యవహరించాలని ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. శుక్రవారం జెడ్పీ సమావేశ మందిరంలో పార్లమెంట్ ఎన్నికల్లో పాల్గొనే మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌తో పాటు ఎన్నికల సాధారణ పరిశీలకులు అమిత్ కటారియా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ పోలింగ్ ప్రారంభం నుంచి ఈవీఎంలు స్ట్రాంగ్ రూమ్‌లకు చేరే వరకు జాగ్రత్తగా విధులు నిర్వర్తించాలన్నారు. పోలింగ్ రోజు ఉదయమే మాక్ పోలింగ్ నిర్వహించాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర చాలా కీలకమని, అత్యుత్తమంగా పని చేయాలని సూచించారు. మాస్టర్ ట్రైనర్లు మైక్రో అబ్జర్వర్ల విధులపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో శ్రీధర్, ఎల్డీఎం ఆంజనేయులు, ఈవీఎంస్ నోడల్ అధికారి కిరణ్ ప్రకాశ్, మాధవి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాణీరుద్రమపై కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు



హుజూరాబాద్: మంత్రి పొన్నం ప్రభాకర్‌పై ఆరోపణలు చేసిన బీజేపీ నాయకురాలు రాణీరుద్రమపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు శుక్రవారం హుజూరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మాజీ సర్పంచ్ నేరెళ్ల మహేందర్‌గౌడ్ మాట్లాడుతూ.. రాణీరుద్రమ మంత్రి పొన్నం ఓ ట్రావెల్స్ అధినేత నుంచి రూ.కోటిన్నర విలువైన కారు తీసుకున్నారని, ఎన్‌టీపీసీ నుంచి బూడిద తీసుకెళ్లే లారీల కాంట్రాక్టర్‌ను బెదిరించి రూ.2 కోట్లు వసూలు చేశారని, గ్రానైట్ లీజుపేరుతో క్వారీ యజమానులకు లాభం రాకుండా కుటుంబ సభ్యులకు దోచిపెట్టారని, కరీంనగర్ పార్లమెంట్ టికెట్ అమ్ముకున్నారంటూ మంత్రి ప్రతిష్టకు భంగం కలిగించారని, ఆమెను అరెస్టు చేసి, చర్యలు తీసుకోవాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు కాజీపేట శ్రీనివాస్, కొల్లూరి కిరణ్‌కుమార్, తిరుపతి, సందీప్, నర్సింహారెడ్డి ఉన్నారు.

తప్పుడు ప్రచారంపై..

కరీంనగర్ క్రైం: సోషల్ మీడియాలో బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌పై కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు తప్పుడు ప్రచారం చేస్తున్నారని బీజేపీ నాయకుడు కొట్టె మురళీకృష్ణ గత నెల 29న కరీంనగర్ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై మరుసటి రోజు కేసు నమోదు చేశామని, విచారణ చేస్తున్నట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు.

ప్రమాదవశాత్తు కార్మికుడు మృతి

మల్యాల(చొప్పదండి): మ్యాడంపల్లి క్వారీలో ప్రమాదవశాత్తు ఓ కార్మికుడు మృతిచెందాడు. ఎస్సై అబ్దుల్‌రహీం కథనం ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం కొండగడపకు చెందిన ఆలకుంట ఉపేందర్(30) కుటుంబంతో మల్యాల మండలం ముత్యంపేటలోని కొండగట్టులో నివాసం ఉంటున్నాడు. మ్యాడంపల్లి శివారులోని హీరా క్వారీలో బండలకు రంధ్రాలు చేసే కాంట్రాక్టు తీసుకున్నాడు. శుక్రవారం రాడ్‌ను సానబెట్టే క్రమంలో కంప్రెషర్ చక్రం విరిగి, అతని చాతికి తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. జగిత్యాల ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

‘దోస్త్’ పిలుస్తోంది!

- డిగ్రీ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసిన ఉన్నత విద్యామండలి
- మొదలైన ‘ప్రైవేటు’ ప్రలోభాలు
- విద్యార్థుల వేటలో పీఆర్వోలు

శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని కళాశాలలు

ప్రభుత్వ	15	ప్రైవేట్	86
ఎయిడెడ్	02	మొత్తం	103



కరీంనగర్ సిటీ: ‘దోస్త్’ పిలుస్తోంది.. డిగ్రీలో ప్రవేశాలకు ఉన్నత విద్యామండలి శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని ప్రైవేట్ కళాశాలలు విద్యార్థుల వేటలో పడ్డాయి. ఇంటర్ పూర్తిచేసిన వారి వివరాలు సేకరిస్తూ పీఆర్వోల ద్వారా టచ్‌లోకి వెళ్తున్నారు. తమ కళాశాలలో చేరాలంటూ, రాయితీ ఆఫర్లు ఇస్తున్నారు. అయా కళాశాలల్లో పనిచేస్తున్న లెక్చరర్లు సైతం అడ్మిషన్లు చేపిస్తే వేతనం పెంచడంతో పాటు ఇతర సౌకర్యాలు కల్పిస్తామంటూ ప్రత్యేక వాహనాలు కేటాయిస్తూ అడ్మిషన్ల కోసం పంపిస్తున్నారు.

రంగంలోకి పీఆర్వోలు, లెక్చరర్లు

ప్రతీ ప్రయివేటు కళాశాల యాజమాన్యం అడ్మిషన్ల కోసం పీఆర్వోలను నియమించుకుంటారు. అధ్యాపకులకు సైతం టార్గెట్లు విధిస్తున్నారు. వీరు ఇంటర్ పూర్తయిన వారి వివరాలు సేకరిస్తూ.. విద్యార్థులను కలుస్తున్నారు. తమ కాలేజీలో చేరాలంటూ సూచిస్తూ... ఆఫర్లు, రాయితీలు ప్రకటిస్తున్నారు. విద్యార్థులను చేర్పించిన పీఆర్వోలు, లెక్చరర్లకు ఒక్కో విద్యార్థికి రూ.4వేల నుంచి రూ.6వేల వరకు చెల్లిస్తున్నట్లు సమాచారం.

విద్యాప్రమాణాలే ముఖ్యం

దోస్త్ వెబ్‌సైట్

శాతవాహన యూనివర్సిటీ పరిధిలో 2024–25 విద్యాసంవత్సరానికి గానూ 15 ప్రభుత్వ, 2ఎయిడెడ్, 86 ప్రైవేట్ కాలేజీలు మొత్తంగా 103 కళాశాలలు ఉన్నాయి. వీటిలో ఉన్నత విద్యాప్రమాణాలు పాటించే కళాశాలలను ఎంచుకోవాలని విద్యావేత్తలు విద్యార్థులకు సూచిస్తున్నారు. ఆఫర్లకు ఆశపడి నాణ్యత పాటించని కళాశాలల్లో చేరి విద్యార్థులు భవిష్యత్ నాశనం చేసుకోవద్దని సూచిస్తున్నారు. పీఆర్వోల మాట వినకుండా, కళాశాల గురించి పూర్తి సమాచారం సేకరించిన తరువాతే చేరాలని చెబుతున్నారు. వీలైతే అందులో చదువుతున్న సీనియర్లను సంప్రందించి ఎలాంటి ప్రమాణాలు పాటిస్తున్నారో తెలుసుకోవాలని చెబుతున్నారు. వీటితో పాటు తల్లిదండ్రులు విద్యార్థులకు నచ్చిన కాలేజీ, కోర్సులు తెలుసుకుని వాటిలో చేర్పితే ఇష్టంగా చదవడమే కాకుండా భవిషత్ బాగుంటుందని విద్యానిపుణులు పేర్కొంటున్నారు.

దోస్త్ 2024- 25 ముఖ్య తేదీలు

నోటిఫికేషన్ విడుదల	03-05- 2024
మొదటి దశ రిజిస్ట్రేషన్లు(ఫీజు రూ.200)	మే 6- 25
వెబ్ ఆప్షన్లు	మే15- 27
సీట్ల కేటాయింపు	జూన్ 03
విద్యార్థులు చేరే సమయం	జూన్ 4- జూలై 10
రెండో దశ రిజిస్ట్రేషన్లు(ఫీజు రూ.400)	జూన్ 4-13
వెబ్ ఆప్షన్లు	జూన్ 4-14
సీట్ల కేటాయింపు	జూన్ 18
విద్యార్థులు చేరే సమయం	జూన్ 19- 24
మూడోదశ రిజిస్ట్రేషన్లు (ఫీజు రూ.400)	జూన్ 19- 25
వెబ్ ఆప్షన్లు	జూన్ 19- 26
సీట్ల కేటాయింపు	జూన్ 29
విద్యార్థులు చేరే సమయం	జూన్ 29- జూలై05
తరగతులు ప్రారంభం	జూలై 08 నుంచి

ఎక్స్‌ప్రెస్ రైళ్ల దారి మళ్లింపు



రామగుండం: రామగుండం రైల్వేస్టేషన్ మీదుగా న్యూఢిల్లీ, చెన్నై వైపు రాకపోకలు సాగించే పలు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను సాంకేతిక కారణాలతో దారి మళ్లించినట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు శుక్రవారం తెలిపారు. అలాగే మరికొన్నింటిని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

దారి మళ్లించినవి..

- రైలు నంబరు 12511, గోరఖ్‌పూర్–కొచ్చువెల్లి : మే 3, 4, 6 10, 17, 18, 20 తేదీల్లో దారి మళ్లించారు.
- రైలు నంబరు 12512, కొచ్చువెల్లి –గోరఖ్‌పూర్ : మే 1, 2, 6, 8, 9, 16, 20, 22 తేదీల్లో దారి మళ్లించారు.
- రైలు నంబరు 12521, రప్తిసాగర్–ఎర్నాకులం : మే 1, 8, 22 తేదీల్లో దారి మళ్లించారు.
- రైలు నంబరు 12522 ఎర్నాకులం–రప్తిసాగర్ : మే 4, 11, 17 తేదీల్లో దారి మళించారు.
- రైలు నంబరు 20805/06 విశాఖ–న్యూఢిల్లీ, రెండు వైపులా : మే 21వ తేదీ వరకు దారి మళ్లింపు.
- రైలు నంబరు 20189/20 పూరీ–ఓఖా(పూరీ ఎక్స్‌ప్రెస్) : మే 19వ తేదీ వరకు దారి మళ్లింపు.

రద్దయినవి..

- రైలు నంబరు 22645, ఇండోర్–కొచ్చువెల్లి(అహల్యనగరి ఎక్స్‌ప్రెస్) : మే 7, 21వ తేదీల్లో రద్దు.
- రైలు నంబరు 22646 కొచ్చువెల్లి –ఇండోర్(అహల్యనగరి ఎక్స్‌ప్రెస్) : మే 5, 19వ తేదీల్లో రద్దు.
- రైలు నంబరు 22647 కోర్బా–కొచ్చువెల్లి(తిరువనంతపురం ఎక్స్‌ప్రెస్) : మే 2, 5, 9, 12, 16, 19, 23వ తేదీల్లో రద్దు.
- రైలు నంబరు 22648 కొచ్చువెల్లి – కోర్బా(తిరువనంతపురం ఎక్స్‌ప్రెస్) : మే 3, 7, 10, 14, 17, 21వ తేదీల్లో రద్దు.

సమ్మర్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు

- రైలు నంబరు 07021, సికింద్రాబాద్ - దానాపూర్ : మే 2, 9, 16, 23, 30, జూన్ 6, 13, 20, 27వ తేదీల్లో నడుస్తుంది.
- రైలు నంబరు 07022, దానాపూర్–సికింద్రాబాద్ : మే 5, 12, 19, 26, జూన్ 2, 9, 16, 23, 30వ తేదీల్లో నడుస్తుంది.
- రైలు నంబరు 03226, సికింద్రాబాద్ - దానాపూర్ : మే 5, 12, 19, 26, జూన్ 2, 9, 16, 23, 30వ తేదీల్లో నడుస్తుంది.
- రైలు నంబరు 03225, దానాపూర్–సికింద్రాబాద్ : మే 4, 11, 18, 25, జూన్ 1, 8, 15, 22, 29వ తేదీల్లో నడుస్తుంది.
- రైలు నంబరు 07007, సికింద్రాబాద్ – రక్సోల్ : మే 1, 8, 15, 22, 29, జూన్ 5, 12, 19, 26 తేదీల్లో నడుస్తుంది.
- రైలు నంబరు 07008, రక్సోల్ – సికింద్రాబాద్ : మే 5, 12, 19, 26, జూన్ 2, 9, 16, 23, 30వ తేదీల్లో నడుస్తుంది.

అనారోగ్యంతో ఎక్సైజ్ ఎస్సై మృతి

- పక్షం రోజుల వ్యవధిలో దంపతుల మృతితో కుటుంబంలో విషాదం


కాళీప్రసాద్ (ఫైల్)


కాళీప్రసాద్ మృతదేహం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న కాళీప్రసాద్(58) శుక్రవారం వేకువజామున అనారోగ్యంతో మృతి చెందాడు. గ్రామస్తులు, కుటుంబీకులు, అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా కొత్తగూడెం పట్టణానికి చెందిన కాళీప్రసాద్ మల్టీజోన్ బదిలీల్లో భాగంగా గత ఫిబ్రవరి 14న ఎల్లారెడ్డిపేట సర్కిల్ కార్యాలయానికి బదిలీపై వచ్చారు. స్థానికంగా ఓ అద్దె ఇంట్లో ఒంటరిగా ఉంటున్నాడు. కొంతకాలంగా మధుమేహం, బీపీ, మూత్రపిండాల వ్యాధులతో బాధపడుతూ చికిత్స తీసుకుంటున్నాడు. ఇంట్లో నిద్రించే క్రమంలో అతడికి తలుపులు వేసుకునే అలవాటు లేదు. అయితే శుక్రవారం ఉదయం తన గదిలో విగతజీవిగా పడి ఉన్న ప్రసాద్‌ను యజమాని గమనించి ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్‌కు సమాచారం అందించారు. అధికారులు ఘటన స్థలానికి చేరుకుని ప్రసాద్ మృతదేహన్ని పరిశీలించి, అతడి కుటుంబీకులకు సమాచారమిచ్చారు. అయితే ప్రసాద్ మృతదేహన్ని పరిశీలించిన అధికారులు అనుమానాస్పద మృతిగా భావించారు. కొత్తగూడెం నుంచి కుమారుడు సాయిరేవంత్ తన స్నేహితులతో వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. తన తండ్రి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలిపారు. అతడి మరణంపై ఎలాంటి అనుమానాలు లేవని పోలీసులకు కూడా ఫిర్యాదు చేయకుండా మృతదేహాన్ని అంబులెన్స్‌లో స్వగ్రామానికి తరలించారు.

పక్షం రోజుల్లో భార్యాభర్తల మృతి

ఎక్సైజ్ ఎస్సై ప్రసాద్ భార్య సావిత్రి 15 రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందింది. అంతలోనే ప్రసాద్ మృతిచెందడంతో కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. భార్య మృతిచెందిన బాధలోనే ప్రసాద్ తీవ్రంగా కుంగిపోయినట్లు పేర్కొన్నారు. అయితే ప్రసాద్ రెండురోజుల క్రితం ఏటీఎం నుంచి వేతనం రూ.40వేలు తీసుకోగా, శుక్రవారం అతడి వద్ద రూ.17వేలు మాత్రమే ఉన్నాయని కుమారుడు పేర్కొన్నాడు.

జర్నలిస్టుల సమస్యలపై ఉద్యమిస్తాం

- హరియాణా, జార్ఖండ్‌లో జర్నలిస్టులకు పింఛన్లు
- డబ్ల్యూజేఐ జాతీయ అధ్యక్షుడు సంజయ్ ఉపాధ్యాయ్


మాట్లాడుతున్న సంజయ్ ఉపాధ్యాయ్

పెద్దపల్లిరూరల్: జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా ఉద్యమిస్తుందని ఆ యూనియన్ జాతీయ అధ్యక్షుడు సంజయ్ ఉపాధ్యాయ్ అన్నారు. పెద్దపల్లిలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జర్నలిస్ట్‌లకు సంక్షేమ పథకాల ఫలాలు అమలు చేయడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయని విమర్శించారు. అనేకమంది విలేకరుల ఆర్థిక పరిస్థితి దయనీయంగా ఉందని, కనీస ఉద్యోగభద్రత కూడా లేదన్నారు. హర్యాణా, ఝార్ఖండ్ రాష్ట్రాల్లో జర్నలిస్ట్‌లకు రూ.15వేల నెలసరి పింఛన్ విధానం అమలవుతోందని, అస్సాంలోనూ అమలుకు సన్నాహాలు చేస్తున్నారని తెలిపారు. క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకునేందుకే జిల్లాస్థాయి సమావేశానికి హాజరయ్యానని వివరించారు. ఉచిత బస్సు, రైలు ప్రయాణం, ఉద్యోగభద్రత, పీఎఫ్, డబుల్‌బెడ్రూమ్ ఇళ్ల తదితర సంక్షేమ పథకాల వర్తింపుకోసం ఎన్నికల అనంతరం సీఎం రేవంత్‌రెడ్డిని కలువనున్నట్లు వివరించారు. డిజిటల్ జర్నలిస్ట్‌లను ప్రభుత్వం గుర్తించాలని కోరారు. సమావేశంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు రాణాప్రతాప్, రావికంటి శ్రీనివాస్, వేణుగోపాల్, బెజ్జంకి నరేశ్ పాల్గొన్నారు.

12 మందిని కరిచిన కుక్కలు


గాయపడిన స్థానికుడు

రాయికల్(జగిత్యాలరూరల్): జగిత్యాల జిల్లా రాయికల్ మండల కేంద్రంలోని కేశవనగర్‌లో శుక్రవారం వీధికుక్కల దాడిలో సుమారు 12 మంది గాయపడ్డారు. కేశవనగర్‌కు చెందిన శ్రీనివాస్, నవీన్, రాజిరెడ్డి, రమేశ్, లక్ష్మి, సత్యనారాయణ, నర్సారెడ్డి, విష్ణు, రాజేశ్వరి, శ్రీలేఖ మరో ఇద్దరిని వీధికుక్కలు కరిచాయి. మున్సిపల్ సిబ్బంది వెంటనే స్పందించి వీధికుక్కలను పట్టుకున్నారు. గాయపడినవారంతా రాయికల్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని చింతలవాడకు చెందిన షాకీర్(45) శుక్రవారం ఉరిపోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికంగా ఉన్న వెల్డింగ్ షాపులో పనిచేసే షాకీర్.. కొంతకాలం క్రితం మద్యానికి బానిసయ్యాడని స్థానికులు తెలిపారు. ఆత్మహత్యకు గల వివరాలు తెలియాల్సి ఉంది.

ఉద్యమనేతకు కన్నీటి వీడ్కోలు


నర్సయ్య మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న అమరుల బంధుమిత్రులు, ప్రజాసంఘాల నేతలు

- స్వగ్రామంలో నర్సయ్య అంత్యక్రియలు పూర్తి
- రోదించిన సోదరి రాజక్క, కుటుంబసభ్యులు


నర్సయ్య పార్థివదేహం వద్ద రోదిస్తున్న సోదరి రాజక్క, కుటుంబసభ్యులు

పాలకుర్తి(రామగుండం): సుమారు 42ఏళ్ల క్రితం అడవి బాటపట్టిన మావోయిస్ట్ నేత, ఉద్యమ కెరటం చీమల నర్సయ్య ఉరఫ్ జోగన్న జీవిత ప్రస్థానం ముగిసింది. నాలుగురోజుల క్రితం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో అసువులు బాసిన జోగన్నకు శుక్రవారం స్వగ్రామంలో అశ్రునయనాల మధ్య అంతక్రియలు జరిపారు. ‘పెత్తందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన చీమల నర్సన్న అమర్ రహే’ అంటూ చేసిన నినాదాలతో జయ్యారం మార్మోగింది. ఉదయం 8.30గంటలకు ప్రత్యేక వాహనంలో నర్సయ్య మృతదేహాన్ని గుడిపల్లి శివారులోని శ్రీచెన్నకేశవస్వామి ఆలయ సమీపంలో స్థానికుల సందర్శనార్థం ఉంచారు. చిన్నప్పుడే పెత్తందార్లు, పోలీస్‌పటేళ్ల వ్యవస్థకు వ్యతిరేకంగా ఉద్యమబాట పట్టిన జోగన్న.. కడదాకా ఉద్యమంలోనే ఉండి పీడిత ప్రజల పక్షాన పోరాటం చేశారని బంధుమిత్రులు, వివిధ ప్రజాసంఘాలు, పౌరహక్కుల సంఘాల నేతలు, అమరుల బంధుమిత్రుల సంఘం నేతలు, మాజీ మావోయిస్టులు, స్థానికులు గుర్తుచేసుకున్నారు. నర్సయ్య పార్థివదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. దాదాపు రెండు గంటల పాటు జోగన్నతో ఉద్యమ సమయంలో పంచుకున్న అనుభవాలు స్మరించుకున్నారు. ఉద్యమ చైతన్య గేయాలు ఆలపిస్తూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. ఉదయం 11గంటల సమయంలో వైకుంఠరథంపై జోగన్న పార్థివదేహాన్ని ఉంచి డప్పుచప్పుళ్ల మధ్య అంతిమయాత్ర ప్రారంభించారు. జయ్యారం గ్రామ శివారులోని శ్మశానవాటికలో నర్సయ్య దహన సంస్కారాలు పూర్తిచేశారు. అమరుల బంధుమిత్రుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పద్మకుమారి, ప్రతినిధులు శాంతక్క, భవాని, అంజమ్మ, సత్య, ఉష, పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మదన కుమారస్వామి, మహ్మద్ హుస్సేన్, శ్రీపతి రాజగోపాల్, విరసం ఉమ్మడి జిల్లా కన్వీనర్ బాలసాని రాజయ్య, తెలంగాణ ప్రజాఫ్రంట్ పెద్దపల్లి జిల్లా కన్వీనర్ గుమ్మడి కుమారస్వామి, నాయకులు పోరెడ్డి వెంకన్న, నారా వినోద్, బొడ్డుపల్లి వినోద్, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ముడిమడుగుల మల్లయ్య, ఎరుకల రాజయ్య, లక్ష్మణ్, పర్వతాలు, పుట్నూర్ ఎంపీటీసీ గంగాధర రమేశ్, నాయకులు కొప్పు రాజేశం, చింతకింది సత్యనారాయణ, ప్రభాకర్‌తో పాటు సమీప గ్రామాల ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

పుట్టిన ఊరులో కన్నా అడవిలోనే ఎక్కువ..

మావోయిస్టు నేత చీమల నర్సయ్య తాను పుట్టిన ఊరులో కన్నా.. అడవిలోనే ఎక్కువకాలం జీవించారు. తన 22ఏళ్ల వయసులోనే వనం బాట పట్టిన నర్సయ్య.. దాదాపు 42ఏళ్ల పాటు ఉద్యమంలో గడిపారని, కనీసం సొంత ఇంటిని కూడా నిర్మించుకోని నిస్వార్థ ఉద్యమ నేత అని స్థానికులు కన్నీటి పర్యంతమయ్యారు. ‘అవ్వ చచ్చిపోతే రాకపోతివి.. చెల్లి చచ్చిపోతే రాకపోతివి.. అడవిలోనే అసువులు బాసితివా తమ్ముడా.. మా ఇంటికి వచ్చినా.. నీ మేనల్లుడు నిన్ను సాదేటోడు కదా.. ఓ తమ్ముడా’ అని నర్సయ్య సోదరి రాజక్క రోదించిన తీరు స్థానికులను కంటతడి పెట్టించింది.

సిరిసిల్ల రైతుబజారులో రౌడీయిజం

- మహిళా రైతుపై పారిశుధ్య కార్మికురాలి దాడి


సిరిసిల్ల రైతుబజారులో మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది పడేసిన మహిళా రైతు కూరగాయలు

సిరిసిల్ల: జిల్లా కేంద్రంలోని రైతు బజారులో కొందరు రౌడీయిజం చేస్తున్నారు. తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లికి చెందిన మహిళా రైతు లక్ష్మి కూరగాయలను తెచ్చి అమ్మేందుకు రైతుబజారులో శుక్రవారం కూర్చున్నారు. ఆమెను అక్కడి నుంచి మరో చోటికి వెళ్లమని రైతుబజారును ఊడ్చే మహిళా పారిశుధ్య కార్మికురాలు కోరారు. ఎండ ఉందని మరోచోటి వెళ్తే గిరాకీ కాదని సదరు మహిళా రైతు లక్ష్మి నీడపట్టున ఉంది. తన మాట వినలేదని పారిశుధ్య కార్మికురాలు దౌర్జన్యంగా మహిళా రైతు కూరగాయలను పారబోసింది. ఆరుగాలం శ్రమించి రైతు బజారులో కూరగాయలను అమ్మేందుకు వస్తే ఇలా దౌర్జన్యంగా తమ శ్రమఫలాన్ని పారబోశారంటూ కన్నీరుపెట్టింది. చాలా సేపు ఆ కూరగాయలను అలాగే ఉంచి నిరసన వ్యక్తం చేసింది. మార్కెట్‌కు వచ్చిన వినియోగదారులు, తోటి రైతులు సైతం లక్ష్మికి అండగా నిలిచి పారిశుధ్య కార్మికుల వేధింపులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికుల వేధింపులు అధిగమయ్యాయని రైతులు వాపోయారు. మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా స్పందించి సిరిసిల్ల రైతు బజారులో రైతులపై పారిశుధ్య కార్మికులు చేస్తున్న రౌడీయిజాన్ని కట్టడి చేయాలని రైతులు కోరుతున్నారు.


అత్త అంత్యక్రియలకు వెళ్తూ కోడలి మృతి

సైదాపూర్: అత్త అంత్యక్రియలకు వెళ్తూ కోడలు తిరిగిరాని లోకాలకు వెళ్లింది. పోలీసులు తెలిపిన వివరాలు..హుజూరాబాద్‌లో నివాసముంటున్న గరిగె చంద్రయ్య తల్లి లింగమ్మ మండలంలోని రాములపల్లి గ్రామంలో నివసిస్తోంది. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న లింగమ్మ శుక్రవారం వేకువ జామున మృతి చెందింది. విషయం తెలిసిన కోడలు గరిగె రమ(54) కొడుకు శివకృష్ణతో కలిసి బైక్‌పై రాములపల్లికి బయలుదేరింది. మండలంలోని ఎలబోతారం ఎస్సీకాలనీ వద్ద రోడ్‌పైకి ఒక్కసారిగా కుక్క అడ్డు రావడంతో కింద పడిపోయారు. రమ తలకు బలమైన గాయం కావడంతో 108లో హుజూరాబాద్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. భర్త గరిగె చంద్రయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని ఎస్సై ఆరోగ్యం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడు..

వేములవాడఅర్బన్: రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి చెందిన ఘటన నాగయ్యపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. వేములవాడ రూరల్ మండలం నాగయ్యపల్లి గ్రామానికి చెందిన సూర రాజేశం–రాధ కుమారుడు సూర హర్షవర్ధన్ (6) ఇంటి నుంచి దుకాణానికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా వేములవాడ నుంచి చందుర్తి వైపు వెళ్తున్న కోళ్ల వ్యాన్ ఢీకొంది. హర్షవర్ధన్‌కు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు వేములవాడ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఒక్కగానొక్క కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో తల్లిదండ్రులు గుండెలు పగిలేలా రోదించారు. బాలుడి మృతితో గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. కాగా బాలుడి మృతికి కారణమైన కోళ్ల వ్యాన్ డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన కుటుంబసభ్యులను పోలీసు సిబ్బంది స్టేషన్ బయట ఉంచి గేట్లు వేసినట్లు బాధితులు మీడియాతో ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం జరిగే వరకు పోలీస్‌స్టేషన్ ఎదుటే ఉంటామని తెలిపారు.

ఎల్లారెడ్డిపేటలో కలప వ్యాపారి..


శేఖర్ (ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి శివారులోని సాయిబాబా ఆలయం వద్ద శుక్రవారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఓ కలప వ్యాపారి అక్కడికక్కడే మృతి చెందాడు. ఏఎస్సై కిషన్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. ముస్తాబాద్‌కు చెందిన కలప వ్యాపారి బండారి శేఖర్(50)కు సామిల్ ఉంది. కర్ర కొనుగోలు నిమిత్తం తన ద్విచక్రవాహనంపై బండలింగంపల్లికి వెళ్లే క్రమంలో గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేటకు చెందిన స్వామి ద్విచక్రవాహనంపై వస్తూ ఎదురెదురుగా ఢీకొన్నాడు. ఘటనలో శేఖర్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందగా.. గాయపడ్డ స్వామిని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య లత, కుమారులు అభినయ్, బబ్లూ ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

నగదు జప్తు

పెద్దపల్లిరూరల్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సరైన ఆధారాలు లేకుండా నగదు, ఇతర విలువైన వస్తుసామగ్రి తరలిస్తూ పట్టుబడితే జప్తు చేస్తామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. ఇలాంటి వాటిని తగిన ఆధారాలు చూపి తీసుకెళ్లాలని ఆయన సూచించారు. ఇప్పటి వరకు రూ..1,58,46,182 నగదు పట్టుబడగా ఆధారాలు చూపిన రూ.1,57,95,182 నగదు విడుదల చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ఆభరణాలు పట్టివేత

జ్యోతినగర్(రామగుండం): శుక్రవారం రాత్రి ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మేడిపల్లి సెంటర్‌లో ఎస్సై ఉదయ్‌కిరణ్ తన సిబ్బందితో తనిఖీలు చేపట్టగా హైదరాబాద్ నుంచి మంచిర్యా వైపు వెళ్తున్న వాహనంలో బంగారు, వెండి ఆభరణాలు కనిపించాయి. కరీనగర్‌కు చెందిన కొత్తకొండ నవీన్ వీటిని తరలిస్తున్నారని గుర్తించారు. ఆధారాలు చూపకపోవడంతో ఎఫ్ఎస్‌టీకు అప్పగించారు. ఆభరణాల విలువ సుమారు రూ. 81,02,691 వరకు ఉంటుందని ఎస్సై వివరించారు.

జగిత్యాల జిల్లాలో..

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తాలో శుక్రవారం ఎస్సై మన్మథరావు ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఉప్పరిపేటకు చెందిన కొక్కు రాజేందర్ ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.2 లక్షలు, విద్యానగర్‌కు చెందిన కంది లక్ష్మణ్ తీసుకెళ్తున్న రూ.లక్ష నగదు సీజ్ చేసి గ్రీవెన్స్‌సెల్‌కు పంపించారు.

లైఫ్@360



ఎండలోనుంచి వచ్చిన వెంటనే
చల్లటి నీళ్లు తాగుతున్నారా?

ఎండలో తిరిగి ఇంటికి వచ్చిన వెంటనే ఫ్రిడ్జ్ లోనుంచి బాటిల్ తీసుకుని చల్లని నీళ్లు గటగటా తాగడం చాలా మందికి అలవాటే. విపరీతమైన వేడిలో మన శరీరానికి రిఫ్రిజిరేటర్‌లోని చల్లటి నీరు కొంత ఉపశమనం కలిగించేమాట నిజమే అయినా ఇలా చేయడం మంచిది కాదంటున్నారు ఆరోగ్య నిపుణులు.

ఎండలోనుంచి వచ్చిన వెంటనే చల్లటి నీళ్లు తాగడం వల్ల గొంతు నొప్పి, టాన్సిలైటిస్ సమస్య మాత్రమే కాదు.. జీర్ణక్రియ నుంచి రోగనిరోధక వ్యవస్థ వరకు... చివరకు గుండెపై కూడా తీవ్ర ప్రభావం పడుతుంది.

ఎందుకంటే రిఫ్రిజిరేటర్‌లోని చల్లటి నీటిని తాగడం వల్ల రక్తనాళాలు కుచించుకుపోతాయి. అదేవిధంగా ఆహారం తిన్న తర్వాత చల్లటి నీరు తాగడం వల్ల శరీర ఉష్ణోగ్రత తగ్గిపోయి జీర్ణక్రియలో సమస్యలు తలెత్తుతాయి. దీంతో ఘన ఆహారం సరిగా జీర్ణం కాదు. ఫలితంగా మలబద్ధకం వస్తుంది.

అంతేకాదు, చల్లటి నీటిని తాగడం వల్ల ఈ నాడి చల్లబడుతుంది. ఇది హృదయ స్పందన రేటును తగ్గిస్తుంది. గుండె కొట్టుకునే వేగం ఒక్కసారిగా తగ్గితే గుండెపోటు వచ్చే ప్రమాదం ఉంది.

రిఫ్రిజిరేటర్‌లోని చల్లటి నీటిని ఎక్కువగా తాగడం వల్ల రోగనిరోధక శక్తి తగ్గుతుంది. ఫలితంగా శరీరంలో వివిధ రకాల సమస్యలు సంభవిస్తాయి. చల్లటి నీటిని తాగడం వల్ల శరీరంలో పేరుకుపోయిన కొవ్వు గట్టిపడుతుంది. ఇది బరువు పెరిగేందుకు దారితీస్తుంది.

అందువల్ల వీలయినంత వరకు ఎండలో నుంచి రాగానే చల్లటి నీళ్లు తాగకూడదు. అందులోనూ ఫ్రిజ్‌లోని నీళ్లు తాగడం అసలు మంచిది కాదు. కొంచెంసేపు ఆగిన తర్వాత కుండలోని నీళ్లు లేదా నార్మల్ వాటర్ ముందు తాగి, ఆ తర్వాత చల్లటి నీళ్లు తాగినా ఫర వాలేదు.

మీకు తెలుసా?

మెదడుకు పదును..!

బజారులో నడిచి వెళ్తున్నప్పుడు తెలిసిన వ్యక్తి ఎదురు పడితే వెంటనే పేరు గుర్తురాదు. పలకరింపుగా నవ్వి ఏదో ఒక రకంగా మేనేజ్ చేయాల్సి వస్తుంది. ఇలా తరచూ జరుగుతుంటే మెదడు బద్ధకంగా ఉంటోందని, మతిమరుపు పెరుగుతోందని జాగ్రత్త పడాల్సిందే. వార్ధక్య లక్షణాలను దూరంగా ఉంచడానికి దేహానికి వ్యాయామం చేసినట్లే మెదడు చురుగ్గా ఉండడానికి తగినంత వ్యాయామం కావాలి. రోజూ కనీసం ఒక్క పజిల్‌నైనా పరిష్కరించడం జ్ఞాపకశక్తిని మెరుగుపరచుకోవడానికి మంచి మార్గం. అలా మెదడును కూడా చురుగ్గా ఉంచినప్పుడే మతిమరుపు అనే వార్ధక్య లక్షణం దూరమవుతుంది. రోజూ ఈ ప్రాక్టీస్ ఉంటే డెబ్బై ఏళ్లు నిండినా సరే జ్ఞాపకశక్తి తగ్గదు. మతిమరుపు దరిచేరదు. దరి చేర్చుకోకూడని మిత్రుడు మతిమరుపు, మెదడు వాడదాం... మెదడును 'వాడి'గా ఉంచుకుందాం.





చక్కెర తగ్గిస్తే కలిగే ప్రయోజనాలివి

చక్కెర ఉన్న పానీయాలు, స్వీట్లు, ఇతర పదార్థాలను తినడం మానేస్తే శరీరంలోకి అధికంగా చేరే కేలరీల పరిమాణం తగ్గుతుంది. దీని వల్ల బరువు నియంత్రణలో ఉంటుంది. ● చక్కెరను దూరం పెట్టడం వల్ల హైబీపీ, గుండె జబ్బులు సహా ఇతర ఆరోగ్య సమస్యలు వచ్చే ముప్పు తగ్గుతుంది ● నోటి ఆరోగ్యం, దంత సంరక్షణ కోసం చక్కెరను దూరం పెట్టడం చాలా మంచిది. చక్కెరతో కూడిన ఆహార పదార్థాలను దూరం పెడితే నోటి సమస్యలు వచ్చే అవకాశం కూడా తగ్గుతుంది ● చక్కెర తినడం మానేయడం వల్ల టైప్–2 డయాబెటిస్ వచ్చే అవకాశం కూడా చాలా తగ్గుతుంది. మూడ్ స్వింగ్స్, చిరాకు, కోపం తగ్గుతుంది. చర్మం త్వరగా ముడతలు పడటం తగ్గి కాంతిమంతంగా మారుతుంది ● జీర్ణక్రియ మెరుగుపడుతుంది. కడుపుబ్బరం, గ్యాస్, మలబద్ధకం వంటి సమస్యలు తగ్గుతాయి.

పిల్లల్లో... వ్యాధి నిరోధకత పెంచండిలా!



వేసవి సెలవలు ఇచ్చేశారు. పిల్లలందరూ ఇంటి దగ్గరే ఉంటారు. ఈ సమయంలోనే వారికి వ్యాధినిరోధక శక్తి అంటే ఇమ్యూనిటీ పెరిగే ఆహారాన్ని అందించడం వల్ల స్కూళ్లు తిరిగి తెరిచి, వర్షాలు పడినా కూడా చిన్నా చితకా వ్యాధులు రాకుండా ఉంటాయి. పిల్లలకు ఎలాంటి ఆహారం అందించాలో తెలుసుకుందాం...

సాధారణంగా పోషకాలన్నీ ఉన్న సమీకృత ఆహారం అందించడం వల్ల వ్యాధినిరోధకత పెరుగుతుంది. అందుకు ఏం చేయాలో చూద్దాం...



గుడ్డు: కోడిగుడ్డులో పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. పిల్లలకు రోజూ ఒక ఉడికించిన గుడ్డు తినిపించాలి. కండరాలు, చర్మం, గుండె ఆరోగ్యానికి గుడ్డు మంచిది. పిల్లల ఎదుగుదలకు అవసరమైన విటమిన్ ఎ, బి2 (రైబోఫ్లేవిన్) కోడిగుడ్డులో లభిస్తాయి.



ఆకుకూరలు: ఆకుపచ్చటి ఆకుకూరలు, కొత్తిమీర, పాలకూర, ఈ సీజన్‌లో సమృద్ధిగా లభించే మునగకాడలు వంటివి తప్పనిసరిగా పెట్టాలి. వీటిలో ఫైబర్‌తోపాటు ఐరన్, జింక్, మినరల్స్ లభిస్తాయి.



పెరుగు, మజ్జిగ: పెరుగులో ప్రోబయోటిక్స్, విటమిన్ బి12 లభిస్తాయి. ఇది పొట్టలో చెడు బ్యాక్టీరియా వృద్ధి చెందకుండా కాపాడుతుంది. ఇమ్యూనిటీని పెంచుతుంది. కాబట్టి పిల్లలు ఇష్టంగా తినేలా ఫ్రూట్ యోగర్ట్, వెజిటబుల్స్ రైతా, బూందీ రైతా రూపంలో ఇవ్వొచ్చు.

పసుపు: పసుపులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలుంటాయి. పిల్లలకు రోజూ ఇచ్చే ఆహారంలో చిటికెడు పసుపును చేర్చడం వల్ల ఆస్తమా, అలర్జీకి సంబంధించిన సమస్యలు దరిచేరకుండా ఉంటాయి. పాలల్లో పసుపు వేసి తాగించడం అలవాటు చేయవచ్చు.

బాదం, జీడిపప్పు, ఎండుద్రాక్ష, వాల్‌నట్స్, అప్రికాట్స్ వంటివి ఎక్కువగా తినిపించడం వల్ల మెదడు ఎదుగుదలకు అవసరమైన పోషకాలు లభించడంతో పాటు పిల్లల్లో ఇమ్యూనిటీ పెరుగుతుంది.

ఇంకా సీజనల్ ఫ్రూట్స్ అయిన మామిడి, జామ, తాటిముంజలు, సపోటా వంటివి ఇవ్వాలి.

పిల్లలకు స్వీట్స్, పంచదార ఎక్కువగా ఉండే ఇతర పదార్థాలైన ఫ్రూట్‌జ్యూస్‌లు, చాక్లెట్స్, ప్యాకేజ్డ్ స్నాక్స్‌ను ఎక్కువగా తినిపించకూడదు. ఇవి ఇమ్యూనిటీని తగ్గిస్తాయి. ముఖ్యంగా పిల్లలు రోజూ తగినంత నిద్రపోయేలా చూడాలి. గంటసేపైనా బయట ఆడుకునేలా ప్రోత్సహించాలి. ఈ జాగ్రత్తలు పాటించడం మంచిది.

హెల్త్ టిప్స్



● కిస్మిస్‌లలో జింక్, కాల్షియం, విటమిన్లు అధికంగా ఉంటాయి. ఇవి మనకు ఎంతగానో మేలు చేస్తాయి. రాత్రిపూట కొన్ని కిస్మిస్‌లను తిని గోరువెచ్చటి నీరు తాగితే మరుసటి రోజు ఉదయం విరేచనం సాఫీగా జరుగుతుంది. మలబద్ధకం తగ్గుతుంది. దీంతో పైల్స్ సమస్య నుంచి బయట పడవచ్చు. అలా కాకపోతే రాత్రి పూట కిస్మిస్‌లను నీటిలో నానబెట్టి.. మరుసటి రోజు ఉదయం కూడా తినవచ్చు. ఎలా తిన్నా సమస్య నుంచి బయట పడతారు.

● బాదంపప్పులో ప్రోటీన్లు, ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు, విటమిన్ ఇ, కాల్షియం, ఫాస్ఫరస్ అధికంగా ఉంటాయి. అందువల్ల బాదంపప్పును రోజూ తింటే పైల్స్ సమస్య నుంచి బయట పడవచ్చు. ఇందుకు గాను బాదంపప్పును రాత్రి పూట నీటిలో నానబెట్టాలి. మరుసటి రోజు ఉదయాన్నే పరగడుపునే వాటిని పొట్టు తీసి తినాలి. దీని వల్ల శరీరంలోని వ్యర్థాలు బయటకు పోవడంతోపాటు మలబద్ధకం తగ్గుతుంది. పైల్స్ సమస్య నుంచి బయట పడవచ్చు.

● జామపండ్లలో విటమిన్లు, మినరల్స్ అనేకం ఉంటాయి. ఇవి దంతాలు, చిగుళ్ల సమస్యలు, జీర్ణ సమస్యలను తగ్గిస్తాయి. జామ పండ్లను తినడం వల్ల తిన్న ఆహారం సరిగ్గా జీర్ణమవుతుంది. మలబద్ధకం ఉండదు. అలాగే పైల్స్ కూడా తగ్గిపోతాయి. రోజూ రాత్రి భోజనం చేసిన తరువాత నిద్రకు ముందు ఒక జామ పండును తింటే ఈ ప్రయోజనం కలుగుతుంది. దీంతో రోగ నిరోధక శక్తి కూడా పెరుగుతుంది.

● రోజూ పరగడుపునే మూడు లేదా నాలుగు పచ్చి వెల్లుల్లి రెబ్బలను తీసుకుని పెనంపై వేసి వేయించి వాటిని అలాగే తినాలి. నేరుగా తినలేం అనుకుంటే తేనెతో కలిపి తీసుకోవచ్చు. దీని వల్ల జీర్ణ శక్తి పెరుగుతుంది. మెటబాలిజం మెరుగు పడుతుంది. గ్యాస్ సమస్యలు తగ్గుతాయి. అజీర్ణం నుంచి బయట పడతారు. మలబద్ధకం తగ్గి పైల్స్ నుంచి విముక్తి పొందవచ్చు.

● జీర్ణ సమస్యలను తగ్గించడంలో బెల్లం అద్భుతంగా పనిచేస్తుంది. రోజూ రాత్రి భోజనం అనంతరం చిన్న బెల్లం ముక్కను చప్పరిస్తూ తినాలి. దీంతో తిన్న ఆహారం సరిగ్గా జీర్ణమవుతుంది. మరుసటి రోజు సుఖ విరేచనం అవుతుంది. క్రమం తప్పకుండా రోజూ రాత్రి బెల్లం తింటే పైల్స్ సమస్య నుంచి బయట పడవచ్చు.

సినిమా

కన్నప్పకి బై బై



● విష్ణు మంచు, అక్షయ్ కుమార్

బాలీవుడ్ స్టార్ హీరో అక్షయ్ కుమార్ 'కన్నప్ప'కి బై బై చెప్పారు. తన పాత్రకి సంబంధించిన సన్నివేశాలను పూర్తి చేసిన ఆయనకి చిత్ర యూనిట్ వీడ్కోలు పలికింది. విష్ణు మంచు హీరోగా ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'కన్నప్ప'. అవా ఎంటర్‌టైన్‌మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్‌లపై మంచు మోహన్‌బాబు పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ మూవీలో ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్‌బాబు, మోహన్ లాల్, శరత్ కుమార్, బ్రహ్మానందం తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో ప్రారంభమైన షెడ్యూల్‌లో అక్షయ్ కుమార్ జాయిన్ అయిన సంగతి తెలిసిందే. తాజాగా తన సీన్లకు సంబంధించిన షూట్‌ను ఆయన పూర్తి చేశారు. ''అక్షయ్ కుమార్‌గారి నుంచి ఎంతో నేర్చుకున్నాను. ఈ ప్రయాణం ఎంతో విలువైనది'' అని సోషల్ మీడియా ద్వారా పేర్కొన్నారు విష్ణు మంచు. ''ధైర్యవంతుడైన యోధుడు, శివ భక్తుడైన కన్నప్ప కథతో ఈ చిత్రం అద్భుతంగా రూపొందుతోంది. ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుంది'' అన్నారు మేకర్స్.



● నయనతార

టాక్సిక్‌లో..?

యశ్

'టాక్సిక్' సినిమాలో నయనతార భాగం కానున్నారా? అంటే అవుననే టాక్ కన్నడ ఇండస్ట్రీలో వినిపిస్తోంది. యశ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'టాక్సిక్'. మలయాళ నటి–దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో హీరోయిన్‌గా కియారా అద్వానీ, శ్రుతీహాసన్ వంటి స్టార్స్ పేర్లు వినిపించాయి. అలాగే యశ్‌కు సోదరి పాత్రలో కరీనా కపూర్ నటిస్తారనే ప్రచారం జరిగింది. దీనికి తోడు తాను సౌత్ సినిమా అంగీకరించినట్లు ఆ మధ్య కరీనా స్వయంగా వెల్లడించారు. అది 'టాక్సిక్' సినిమానే అనే ప్రచారం సాగింది. అయితే తాజాగా షూటింగ్ కాల్షీట్స్ సర్దుబాటు చేయలేని కారణంగా ఈ ప్రాజెక్ట్ నుంచి కరీనా కపూర్ తప్పుకున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ ప్లేస్‌లో నయనతారను తీసుకోవాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట. 2010లో ఉపేంద్ర నటించిన 'సూపర్' కన్నడలో నయనతారకు తొలి సినిమా. వార్తల్లో ఉన్న ప్రకారం నయనతార 'టాక్సిక్' సినిమా చేస్తే.. పద్నాలుగేళ్ల తర్వాత ఆమె కన్నడ సినిమా చేసినట్లవుతుంది.

ముంబైలో వేట్టయాన్



● అమితాబ్ బచ్చన్ ● రజనీకాంత్

ముంబైలో అమితాబ్ బచ్చన్‌ను కలిశారు వేట్టయాన్. రజనీకాంత్ హీరోగా 'జై భీమ్' ఫేమ్ టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'వేట్టయాన్' (వేటగాడు). అమితాబ్ బచ్చన్, ఫాహద్ ఫాజిల్, రానా ఇతర లీడ్ రోల్స్‌లో దుషారా విజయన్, మంజు వారియర్, రితికా సింగ్ కీలక పాత్రల్లో నటిస్తున్న చిత్రం ఇది. తాజాగా 'వేట్టయాన్' చిత్రీకరణ ముంబైలో ప్రారంభమైంది. రజనీకాంత్, అమితాబ్ బచ్చన్ పాల్గొంటుండగా కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. గతంలో హైదరాబాద్‌లో జరిగిన 'వేట్టయాన్' షూటింగ్ షెడ్యూల్‌లో రజనీ, అమితాబ్ కాంబినేషన్ సీన్స్ తీశారు. ఇప్పుడు ముంబైలో వీరిద్దరి కాంబినేషన్ సీన్స్‌ను తీస్తున్నారు. బూటకపు ఎన్‌కౌంటర్స్ నేపథ్యంలో ఈ సినిమా ఉంటుందని టాక్.

వినోదాల పతంగ్



● ప్రీతి పగడాల

ప్రీతి పగడాల, ప్రణవ్ కౌశిక్, వంశీ పూజిత్ ముఖ్య తారలుగా నటించిన చిత్రం 'పతంగ్'. ప్రణీత్ ప్రత్తిపాటి దర్శకత్వం వహించారు. సినిమాటిక్ ఎలిమెంట్స్ అండ్ రిషన్ సినిమాస్‌పై విజయ్ శేఖర్ అన్నే, సంపత్ మక, సురేష్ కొత్తింటి నిర్మించిన ఈ చిత్రం టీజర్‌ను డైరెక్టర్ బుచ్చిబాబు సానా విడుదల చేశారు. ఈ సినిమా కాంటెస్ట్ విజేతలకు సిరిసిల్ల మాజీ ఎంపీ రాజయ్య బహుమతులు అందించారు. బుచ్చిబాబు సానా మాట్లాడుతూ– ''ఈ మూవీ కంటెంట్ చూస్తుంటే 'హ్యాపీడేస్' సినిమాలా ఘన విజయం సాధిస్తుందనిపిస్తోంది'' అన్నారు. ''తొలిసారి పతంగుల పోటీతో రాబోతున్న కామెడీ స్పోర్ట్స్ డ్రామా చిత్రం 'పతంగ్''' అన్నారు ప్రణీత్ ప్రత్తిపాటి. ''వేసవిలో మా సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది'' అన్నారు సంపత్ మక. ప్రణవ్ కౌశిక్, ప్రీతి పగడాల, వంశీ పూజిత్, క్రియేటివ్ నిర్మాత నాని బండ్రెడ్డి పాల్గొన్నారు.



● మెరిల్ స్ట్రీప్

ఈ పురస్కారం నాకో గౌరవం

హాలీవుడ్

ప్రముఖ నటి మెరిల్ స్ట్రీప్ ఆనందంలో ఉన్నారు. ఈ నెల 14 నుంచి 25 వరకు ఫ్రాన్స్‌లో 77వ కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ జరగనున్న సంగతి తెలిసిందే. ఈ చలన చిత్రోత్సవాల్లో ప్రతిష్ఠాత్మకమైన పామ్ డి ఓర్ గౌరవ పురస్కారానికి మెరిల్ స్ట్రీప్‌ను ఎంపిక చేసినట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఆమె ఆనందానికి కారణం ఇదే. ఈ ఏడాది మెరిల్ స్ట్రీప్‌కు, జపాన్‌కు చెందిన యానిమేషన్ 'స్టూడియో ఘిబ్లి' నిర్వాహకులకు, హాలీవుడ్ దర్శక–నిర్మాత జార్జ్ వాల్టన్ లూకాస్ జూనియర్ ('స్టార్ వార్స్, ఇండియానా జోన్స్' ఫేమ్)కు పామ్ డి ఓర్ పురస్కారాన్ని అందజేస్తారు. ఈ సందర్భంగా మెరిల్ స్ట్రీప్ మాట్లాడుతూ – ''ఈ అవార్డుకు ఎంపిక కావడాన్ని గౌరవంగా భావిస్తున్నాను. అంతర్జాతీయ నటీనటులు, ఫిల్మ్ మేకర్స్ భాగాస్వామ్యులైన కాన్స్ వేదికగా నేను ఈ అవార్డును గెలుచుకోవడం అనేది ఫిల్మ్ మేకింగ్ రంగంలో నాకు దక్కిన ఓ అద్భుత విజయంగా భావిస్తున్నాను'' అని చెప్పుకొచ్చారు. గతంలో హాలీవుడ్ స్టార్స్ టామ్ క్రూజ్, మైఖేల్ డగ్లస్, హారిసన్ ఫోర్డ్ వంటివారికి పామ్ డీ ఓర్ అవార్డు దక్కింది.

లక్ష్మీ కటాక్షం ఫిక్స్



● 'లక్ష్మీ కటాక్షం' పోస్టర్

సాయికుమార్ లీడ్ రోల్‌లో సూర్య దర్శకత్వం వహించిన చిత్రం 'లక్ష్మీ కటాక్షం: ఫర్ ఓట్'. ఆమని, వినయ్, అరుణ్, దీప్తీ వర్మ, చరిష్మా శ్రీకర్, హరి ప్రసాద్, సాయికిరణ్ ఏడిద కీలక పాత్రల్లో నటించారు. యు. శ్రీనివాసుల రెడ్డి, బి. నాగేశ్వర రెడ్డి, వహీద్ షేక్, కె. పురుషోత్తం రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న రిలీజ్ కానుంది. ''పొలిటికల్ సెటైరికల్ డ్రామా, కామెడీ నేపథ్యంలో రూపొందిన చిత్రం ఇది. ఈ చిత్రంలో ఓటర్లే వారి ఓటుకు ఒక రేటు నిర్ణయించుకుని నాయకులని ముప్పు తిప్పలు పెట్టే సీన్లు ప్రేక్షకులను నవ్విస్తాయి'' అన్నారు మేకర్స్.



● అషు రెడ్డి

సూపర్ డీలక్స్...

'బిగ్ బాస్' ఫేమ్ అషు రెడ్డి, చాందినీ చౌదరి, వశిష్ఠ సింహా, జై భారత్ ముఖ్య తారలుగా రూపొందుతున్న చిత్రం 'యేవమ్'. ప్రకాశ్ దంతులూరి దర్శకత్వంలో ఈ చిత్రాన్ని నవదీప్, పవన్ గోపరాజు నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో హారిక పాత్ర చేస్తున్న అషు రెడ్డి లుక్‌ను విడుదల చేశారు. ''మహిళా సాధికారతను చాటి చెప్పే నేపథ్యంలో 'యేవమ్' ఉంటుంది. నా బాడీ సూపర్ డీలక్స్ అని అషు రెడ్డి కిక్ ఇచ్చే పాత్రలో ఎందుకు కనిపించబోతున్నారో తెలియాలంటే 'యేవమ్' విడుదల వరకు ఆగాల్సిందే. కొత్త కథతో వైవిధ్యమైన నరేషన్‌తో ఈ సినిమా ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది.

ఎమోషనల్ సత్య

సమాజంలో తన వల్ల తన తల్లిదండ్రులకు ఏ మాత్రం ఇబ్బంది కలగకూడదని ఆలోచించే ఓ కొడుకు కథతో రూపొందిన చిత్రం 'సత్య'. హమరేశ్, ప్రార్థనా సందీప్ జంటగా నటించిన ఈ చిత్రానికి వాలీ మోహన్‌దాస్ దర్శకుడు. శివమ్ మీడియా పతాకంపై శివ మల్లాల నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న విడుదల కానుంది. ఈ సందర్భంగా వాలి మాట్లాడుతూ– ''సత్య' సినిమా హిట్ అయి, యూనిట్‌కి మంచి పేరు తెస్తుందని ఆశిస్తున్నాను'' అన్నారు. ''ఈ సినిమా సెన్సార్ పూర్తయింది. ఈ నెల 10న తెలుగు రాష్ట్రాల్లో భారీ స్థాయిలో సినిమాను విడుదల చేయనున్నాం'' అన్నారు శివ మల్లాల.



● హమరేశ్, ప్రార్థన

1980లో ఏం జరిగింది?



● రాకేష్ వర్రె

'ఉయ్యాలా జంపాలా, మజ్ను' చిత్రాల ఫేమ్ విరించి వర్మ దర్శకత్వం వహించిన చిత్రం 'జితేందర్ రెడ్డి'. రాకేష్ వర్రె హీరోగా నటించారు. వైశాలీ రాజ్, రియా సుమన్, ఛత్రపతి శేఖర్, సుబ్బరాజు, రవి ప్రకాశ్ ఇతర పాత్రల్లో నటించారు. ముదుగంటి రవీందర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న విడుదల కానుంది. ఈ సందర్భంగా విరించి వర్మ మాట్లాడుతూ– ''1980లో జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా పొలిటికల్ డ్రామాగా ఈ సినిమాను రూపొందించాం. ప్రేమకథలు దర్శకత్వం వహించిన నేను 'జితేందర్ రెడ్డి' లాంటి యాక్షన్ మూవీ చేయడంతో క్రేజ్ నెలకొంది'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: వీఎస్ జ్ఞాన శేఖర్, సంగీతం: గోపీ సుందర్.



● అశోక్ గల్లా, మానస

ఏమయ్యిందే...

అశోక్ గల్లా, వారణాసి మానస జంటగా నటిస్తున్న చిత్రం 'దేవకీ నందన వాసుదేవ'. అర్జున్ జంధ్యాల దర్శకుడు. 'హనుమాన్' మూవీ ఫేమ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ ఈ కథ అందించారు. నల్లపనేని యామిని సమర్పణలో సోమినేని బాలకృష్ణ నిర్మిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించిన ఈ మూవీ నుంచి 'ఏమయ్యిందే..' అంటూ సాగే తొలి పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. సురేష్ గంగుల రాసిన ఈ పాటని ఈశ్వర్ దాతు పాడారు.